ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
శుక్రవారం 10 జనవరి 2025



రైతులకు చేరువలో 'సహకారం'



- పునర్విభజన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు
- ప్రతి మండలానికి రెండు ఉండేలా సూచన..
- జిల్లాలో కొత్తగా పది వరకు ఏర్పడనున్న సంఘాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో మరిన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను నెలకొల్పేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటి ద్వారా రైతులకు సహకార సేవలు మరింత చేరువ కానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 20 సహకార సంఘాలు ఉండగా, మరో పది సంఘాలు పెరిగే అవకాశాలున్నాయి. సహకార సంఘాలను పునర్విభజించాలని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఆ మేరకు పది రోజుల క్రితం కలెక్టర్ అధ్యక్షతన నాబార్డు డీడీఎం, కేడీసీసీ బ్యాంకు సీఈవో, జిల్లా సహకార శాఖాధికారి, జిల్లా వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖాధికారులు సభ్యులుగా ఉండే జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో జిల్లాలో ఎక్కడెక్కడా కొత్తగా సహకార సంఘాలను ఏర్పాటు చేయవచ్చనే విషయమై చర్చించారు. జిల్లాలో మొత్తం 14 మండలాలు ఉండగా, మండలానికి కనీసం రెండు సంఘాలైనా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు తెలుస్తున్నది. జిల్లాలో ప్రస్తుతం 20 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి.

సుల్తానాబాద్ మండలంలో సుల్తానాబాద్, గర్రెపల్లి, కనుకుల, చిన్నకల్వల, సుద్దాల, ఎలిగేడు మండలంలో ఎలిగేడు, ధూళికట్ట, జూలపల్లి మండలంలో జూలపల్లి, ఓదెల మండలంలో పొత్కపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలంలో కాల్వశ్రీరాంపూర్, కూనారం, పెద్దపల్లి మండలంలో పెద్దపల్లి, అప్పన్నపేట. ధర్మారం మండలంలో ధర్మారం, పత్తిపాక, కమాన్ పూర్ మండలంలో కమాన్‌పూర్, ముత్తారం మండలంలో ముత్తారం, మంథని మండలంలో మంథని, పాలకుర్తి మండలంలో కన్నాల, రామగుండం మండలంలో మేడిపల్లిలో సహకార సంఘాలు ఉన్నాయి.

ఈ సంఘాల్లో 52,316 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు, బంగారం తాకట్టు రుణాలు, వాహన రుణాలు, ఇతర రుణాలు అందజేస్తున్నారు. అలాగే ఎరువులు, క్రిమిసంహార మందులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. రైతులు పండించిన పంట ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 250కి పైగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి సీజన్‌లో ఏర్పాటుచేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వల్ల కమీషన్ రూపేణా ప్రతి ఏటా 12 కోట్ల రూపాయలు సహకార సంఘాలకు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ద్వారా ఆదాయం సమకూరుతున్నది. ఈ డబ్బులు సంఘం అభివృద్ధికి ఎంతో దోహద పడుతున్నాయి. వాణిజ్య బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వనప్పుడు రైతులకు సహకార సంఘాల ద్వారానే పంట రుణాలు ఇచ్చేవాళ్లు. ఆయా సహకార సంఘాల్లో అక్రమాలు, అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరగడంతో నష్టాల పలయ్యాయి. దీంతో జిల్లాలో కొన్ని సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఉన్న సంఘాల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరగడంతో నిధుల దుర్వినియోగం తగ్గుముఖం పట్టింది.

● సాధ్యాసాధ్యాలపై పరిశీలన..

ప్రతి మండలానికి రెండు సహకార సంఘాలు ఉండేలా చర్యలు తీసుకునేందుకు రీఆర్గనైజేషన్ చేయాలని ఆదేశించిన మేరకు జిల్లాలో కసరత్తు ప్రారంభించారు. మంథని, ముత్తారం, కమాన్‌పూర్, ఓదెల, జూలపల్లి మండలాల్లో కేవలం

మిగతా 6వ పేజీలో..

దేవాదాయ భూముల రక్షణకు చర్యలు

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్



ఫటాఫట్

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖకు చెందిన భూముల స్వాధీనం-పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆక్రమణకు గురైన భూములను తొలుత గుర్తించి వాటిని అమ్మకుండా సంబంధిత రిజిస్ట్రేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 22(ఎ)(1)(సి) ప్రకారం నిషేధిత భూముల కింద నమోదు చేయిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో 57 కేసులు హైకోర్టులో, 27 కేసులు ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో నమోదయ్యాయి.

ప్రశ్న: ఆలయాలను తనిఖీ చేస్తున్నారా?

సమాధానం: ప్రతీ నెల పది ఆలయాలను తనిఖీ చేస్తున్నాం. భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రత, సీసీ కెమెరాలు, ప్రతీ యేటా జరిగే వేడుకల నిర్వహణపై అర్చకులు, అధికారులు, సిబ్బందితో చర్చిస్తున్నాం.

ప్రశ్న: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సమాధానం: ఆలయాల్లో, కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే.. ఉత్సవాల సమయంలో, భక్తులు రద్దీగా ఉన్న సమయంలో సేవా సంస్థల సభ్యులు, ఇతర ఆలయాల ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటున్నాం.

ప్రశ్న: ఎన్ని ఆలయ కమిటీల ఏర్పాటు పూర్తయ్యాయి?

సమాధానం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 ఆలయాల కమిటీలకు నోటిఫికేషన్ వచ్చింది. వీటిలో ఐదింటికి ట్రస్టుబోర్డులు ఏర్పాటయ్యాయి.మూడు ఆలయాలకు దరఖాస్తులు రాలేదు. 27 ఆలయాల కమిటీలకు వివిధ దశల్లో ప్రక్రియ కొనసాగు తోంది.

- కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

న్యూస్ బాక్స్

సహకార సంఘాన్ని సందర్శించిన ఇఫ్కో విజిలెన్స్ అధికారి

సుల్తానాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ సహకార సంఘాన్ని గురువారం ఢిల్లీలోని ఇఫ్కోకు చెందిన విజిలెన్స్ అధికారి సుధీర్ కుమార్ సందర్శించారు. ఆయనతోపాటు జిల్లా మేనేజర్ బాలాజీ ఉన్నారు. సుల్తానాబాద్ సొసైటీ పరిధిలోని రైతులందరికీ అవసరమైన ఎరువుల నిలువలు అందుబాటులో ఉంచుతామని ఇఫ్కో అధికారి తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్, సీఈవో బూరుగ సంతోష్ ఉన్నారు.

ఆర్టీసీ డిపోలో మెయింటనెన్స్ డే

మంథని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్‌డిపోలో డీఎం శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మెయింటనెన్స్ డేను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. బస్సుల స్టీరింగ్,బ్రేక్స్ విషయంలో జాగ్రత్త తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. డిపోలో మెరుగైన సేవలందించిన మెకానిక్ ఆర్.రమేష్, శ్రామిక్ కే. సంపత్‌లను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఏడీఎం ఏంజెల్, సూపరిండెంట్ ఎల్ఆర్ రెడ్డి, ఎల్‌హెచ్ శ్రీనివాస్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు

రామగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ రైతు వేదికలో గురువారం విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహించారు. తెలంగాణ ఈ లోకల్ కోర్టు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన విద్యుత్ సమస్యలపై పలువురు మాజీ ప్రజాప్రతినిధుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. టెక్నికల్ సభ్యుడు కె రమేశ్, ఫైనాన్స్ సభ్యుడు చరణ్‌దాస్, రామారావు, మంథని డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

టీపీబీవో ఉద్యోగ ఫలితాల్లో ఎంపికైన సింధూజ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన బంగారి సింధూజ టీపీబీవో ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో ఎంపికైంది. ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఫలితాలను టీజీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. 2023 జూలైలో టీపీబీవో ఉద్యోగాలకు రాత పరీక్ష జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగం రావడంతో పలువురు సింధూజను ప్రశంసించారు.

దేవాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కళ్యాణ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం గోదావరిఖనిలోని పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో దర్శనం చేసుకున్న ఆయన శివాలయం, అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు జరిపారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అయ్యప్ప దేవాలయంలో అభివృద్ధి పనుల గురించి నిర్వాహకులు చర్చించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీ నాయకులు అయోధ్య రవీందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, అడ్డాల గట్టయ్య, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గట్ల రమేష్, పెద్దెల్లి ప్రకాష్, అడ్డాల రామస్వామి, కైలాసకోటి శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వయంభు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అంతర్గాం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం రామగుండం పట్టణ సమీపంలోని రామునిగుండాల్లో స్వయంభు వెలసిన ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అక్కడ అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులతో చర్చించారు. వెంట నాయకులు దీటి బాలరాజు, మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, మొహిద్ సన్ని ఉన్నారు.

జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనికల్పించాలి

డీఆర్డీవో పీడీ కళానందిని



సోషల్ ఆడిట్‌లో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ కళానందిని

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ జాబ్‌కార్డులు అందజేసి ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని డీఆర్డీవో కళానందిని అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో 2023-2024సంవత్సరాలకుగాను నిర్వహించిన పనులు, చెల్లింపు వేతనాలపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 24గ్రామపంచాయతీల్లో చేసిన పనులపై చర్చించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో మూడుకోట్ల 68లక్షల 73వేలు ఖర్చు చేశారు. ఏపీడీ సత్యనారాయణ, అబ్జర్వర్ శరత్, ఏపీవో కొమురయ్య, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఏపీవో మంజు మాల, ఎంపీవో కిరణ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, మమత, సత్యనారాయణ, ఏఎస్ఓ గణేష్, హరి, దేవేందర్, వేణు, ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ధర్మారం జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిమేడారంలో లయన్స్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి, ధర్మారం లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి శిబిరాన్ని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రేకుర్తి ఆసుపత్రి పేదవారికి ఉచిత కంటి ఆపరేషన్స్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రథమ గవర్నర్ సింహరాజు కోదండరాములు రీజనల్ చైర్మెన్ తన్నీరు రాజేందర్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లనాయక్, వైస్‌చైర్మన్ అరిగే లింగయ్య, పెద్దపల్లి సీఐ కే ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఐనాల ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్, జోన్ చైర్మన్ డాక్టర్ కామని శ్రీనివాస్, సామ మాల్లరెడ్డి, మనీందర్‌రెడ్డి, ముజాయిద్, కట్ట రమేష్ పాల్గొన్నారు.

రామగుండంలో బొగ్గు దందా..

- మళ్లీ రంగంలోకి పాత స్మగ్లర్లు
- ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే వ్యాగన్ల నుంచి చోరీ



రైల్వే ట్రాక్ వెంట బొగ్గు బస్తాలు(ఫైల్)

5

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీ

- పారిశుధ్య లోపాలపై ఆగ్రహం
- విద్యార్థులతో కలిసి భోజనం



వంటశాలను పరిశీలిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

4

పోలీసుల పనితీరుపై ఫీడ్ బ్యాక్ సేకరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో పోలీస్ సిబ్బంది ప్రవర్తన, పనితీరు, ఫిర్యాదులపై స్పందించిన విధానం గురించి పోలీస్ సిబ్బందిపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలుపడానికి రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ పద్ధతిని వినియోగంలోకి తీసుకువచ్చారు. గురువారం డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూనిట్ అధికారులతో మాట్లాడి క్యూ ఆర్ కోడ్ గురించి వివరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సీపీ శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఐదు కంటే తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని, ప్రతి పోస్టర్ ఏ3 సైజులో ఉండాలన్నారు. సీపీ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా పిటీషన్, ఎఫ్ఐఆర్, ఈ చలాన్ పాస్‌పోర్టు ధ్రువీకరణ, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ప్పుడు పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రవర్త నపై అభిప్రాయాలు నమోదవుతాయ న్నారు. జూమ్ మీటింగ్‌లో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు పాల్గొన్నారు.

సెలవులకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలి

పండుగ సెలవులకు ఊరికి వెళుతున్న సమయంలో ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన ఆభరణాలు, డబ్బులు ఇంట్లో ఉంచవద్దని, బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచవద్దని, తమతో పాటే తీసుకువెళ్లాలన్నారు. ఇంటి తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళాలు బిగించుకో వాలన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేయాలని, ద్విచక్ర వాహనాలకు చైన్స్‌తో లాక్ చేయాలన్నారు. పక్కింటి వారిని ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలని, ఇంటికి తాళం వేసిన తరువాత తాళం కనబడకుండా డోర్ కర్టన్లు వేయాలన్నారు.

పొలాలకు వెళ్లడానికి దారి ఇప్పించండి..

మంథని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిట్టుపల్లి గ్రామ శివారులో సింగరేణి సంస్థ తీసుకున్న భూమి చుటూ ఫెన్సింగ్ వేయడంతో పొలాలకు వెళ్లడానికి రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా దారి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరుతూ ప్రజా సంఘాల నేతలు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బూడిద గణేష్, ఆర్ల సందీప్, మంథని లింగయ్య, రైతులు పోచయ్య, మాధవరావు, సతీస్, కనుకయ్య, శివరంజన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక ఉత్పత్తి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాగు పద్ధతులతో అధిక ఉత్పత్తి సాధ్యమవుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్ ప్రాంగణంలో విఘ్నేశ్వర డ్రోన్స్ సేల్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 4డ్రోన్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు మరింత లాభం లబ్ధి చేకూరుతుందని, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా నాట్లు వేయటం, పురుగుల మందు, గడ్డి మందు స్ప్రే చేయడం, ఎరువుల వినియోగం వంటి వాటికి డ్రోన్ సేవలను వినియోగించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, విఘ్నేశ్వర డ్రోన్ నిర్వాహకులు రమేష్, సంపత్, మహేందర్, అఖిల్, రాజు సంబంధిత అధికా రులు, పాల్గొన్నారు.

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గెజిటెడ్ అధికారులు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తూము రవీందర్, కార్యదర్శి లెంకల బ్రహ్మానందరెడ్డి, సహ అధ్యక్షులు కే అలివేణి, కోశాధికారి కే కరుణాకర్, ఉపాధ్యక్షులు వై కుమార్, ఎండీ సాజిద్ అలి, ఎన్ అంజని, ఎం కరుణాకర్, సంయుక్త కార్యద ర్శులు జి శ్రీనివాస్, ఎస్ మధు, జే అనూష, ఆర్ అలేఖ్య, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి సురేశ్, ప్రచారకార్యదర్శి శ్రీకాంత్, కార్యాలయకార్యదర్శి శంకర్‌యాదవ్, సాంస్కృతిక కార్యదర్శి తిరుమల్, క్రీడల కార్యదర్శి మధుబాబు, కార్యవర్గ సభ్యులు గంగ ప్రణవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'టాస్క్' కోర్సుల శిక్షణకు రిజిస్ట్రేషన్లు : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : టాస్క్ ద్వారా వివిధ కోర్సులు శిక్షణకు ఈనెల 10నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపా రు. జిల్లాలోని నిరుద్యోగ విద్యార్థులకు ఇటీవల ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా వివిధ కోర్సులకు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ని ష్ణాతులైన బోధకులతో తరగతులను నిర్వహి స్తామని, టాస్క్ కేంద్రంతో ఒప్పందం కుదుర్చు కున్న బహుళజాతి సంస్థల్లో ఉద్యోగ అవకాశా లను కూడా ఇప్పించడం కోసం జాబ్ మేళాను నిర్వహిస్తామన్నారు. ఔత్సాహిక నిరుద్యోగులు టాస్క్ కేంద్రానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

తరగతులు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతాయని, ఇతర వివరాలకు పెద్దపల్లి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలోగల టాస్క్ ఆఫీసులో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్(ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి పై గురువారం లారీని వెనక నుంచి మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లికి చెందిన గంగినేని అజయ్ (23) అనే యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు తన మోటార్‌సైకిల్‌పై వెళ్లి విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చేవాడు. గురువారం ఉదయం బైక్‌పై కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ డ్రైవర్ ముంజంపల్లి గ్రామ శివారులో ఒక్కసారిగా బ్రేక్ వేసి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. బైక్‌పై వెళుతున్న అజయ్ లారీని వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

లారీ డ్రైవర్ పారిపోతుండగా గ్రామస్థులు వెంబడించి మానకొండూర్‌లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అజయ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో గురువారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వెళ్తోంది. తాడికల్ శివారు నుంచి వెళ్తున్న సమయంలో రామగుండం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. దీంతో వెనుక సీట్లో కూర్చున్న కరీంనగర్‌కు చెందిన కృష్ణవేణి, జ్యోతిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని ఆస్పత్రికి తరలించారు.

రైల్వే వ్యాగన్ల నుంచి తరలిస్తున్న బొగ్గు పట్టివేత



పట్టుబడిన బొగ్గు ట్రాక్టర్‌తో సెక్యూరిటీ సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా సింగరేణి బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి ఆర్జీ-2 ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. ఇటీవల రైల్వే వ్యాగన్ల నుంచి బొగ్గు చోరీకి గురవుతుండడంతో నిఘా పెట్టిన సెక్యూరిటీ సిబ్బంది ఎల్కలపల్లి గేట్ సమీపంలో పోచమ్మగుడి వద్ద బొగ్గును తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 22టీ 0658)ను ఆర్జీ-2 ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది రాకను గమనించిన దుండగులు ట్రాక్టర్‌ను వదిలిపారిపోయారు. ట్రాక్టర్‌తో పాటు లోడ్ చేసిన ఆరు టన్నుల బొగ్గును సిబ్బంది జీఎం ఆఫీస్‌కు తరలించారు. ఆర్జీ-2 సెక్యూరిటీ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్‌తో పాటు షిఫ్టు మేనేజర్ సంపత్, విజయ్‌కుమార్, ఎంటీఎఎఫ్ గార్డులు రమేష్, రత్నం దేవదాసు, ఇంటలిజెన్స్ గార్డు నీలం రవిలు చాకచక్యంగా ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఆర్జీ-2 జీఎం బీ వెంకటయ్య వారిని అభినందించారు.

ఇసుక డంపుల స్వాధీనం



ఆత్మనగర్‌లో ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం గ్రామ శివారులో సుమారు 50 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను నిల్వలను అధికారులు గుర్తించారు. తహసీల్దార్ శ్రీనివాస్ అదేశాల మేరకు అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పనితీరుపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు.. తీరును మార్చుకుని కార్యకర్తలను పట్టించుకోండి..'
టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



'నేను మారాను.. మీరూ మారండి.. పార్టీ ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరి పనితీరుకు సంబంధించిన రిపోర్ట్ నా దగ్గర ఉంది. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదు'
నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్‌లో వార్నింగ్‌ల వణుకు



- పనితీరు మార్చుకోవాలని నేతలకు అధిష్టానం హెచ్చరిక
- మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి
- తమను పట్టించుకోవవడం లేదని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల ఆవేదన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్టీ అగ్రనేతల హెచ్చరికలు కాంగ్రెస్ పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఇద్దరు నేతల హెచ్చరికలతో షాక్‌లో ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదని, కొందరు పార్టీ నేతలను, కార్యకర్తలను పట్టించుకోకుండా ఇతర దందాల్లో నిమగ్నమై పార్టీకి నష్టం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న సర్వే రిపోర్టులో ఉందని ప్రచారం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా పరిధిలో కూడా కొందరి పనితీరు బాగా లేదని వెల్లడైనట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇప్పుడు ఆ కొందరు ఎవరు అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అధికారిక కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా కార్యకర్తలతో సమయమిచ్చి మాట్లాడడం లేదనే విమర్శలున్నాయి. తమను పట్టించుకునే వారే లేరని ద్వితీయ శ్రేణి నేతలు, ముఖ్య కార్యకర్తలు వాపోతున్నారు. ఎమ్మెల్యేల పనితీరు సందర్భంగా వెల్లడైన రిపోర్టులో ఈ అసంతృప్తి గురించి స్పష్టంగా పేర్కొన్నారని, దానిని సీరియస్‌గా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలను హెచ్చరించారనే చర్చ జరుగుతోంది. సీఎం, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరికలతో ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైనట్లు తెలిసింది.



ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరుపై నెగెటివ్ రిపోర్టు

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో తొమ్మిదిమంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలో ఉన్నారు. వీరిలో శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉన్నారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురి పనితీరుపై నెగెటివ్ రిపోర్టు వచ్చిందని తెలిసింది. అందులో తమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏ నలుగురు కాంగ్రెస్ నేతలు కలిసినా ఆ ఎమ్మెల్యేలు ఎవరు అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నా స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేలు దృష్టిసారించడం లేదని, స్థానిక నేతలతో సమస్యలేమిటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే ప్రణాళికలు రూపొందిం చుకునే ప్రయత్నాలు జరగడం లేదనే విమర్శలున్నాయి. స్థానిక ఎన్నికల్లో గెలవా లంటే ఎవరికి అవకాశం కల్పిస్తే బాగుంటుంది అనే విషయాన్ని కూడా పట్టించు కోవడం లేదని అసంతృప్తి వ్యక్తమవుతు న్నది. సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలు ఇచ్చినంత మాత్రాన సరిపోదని, ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలను గ్రామ స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నా లు జరగాలంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు కలిసిమెలిసి తిరిగినప్పుడే ఇది సాధ్యమవుతుందని, ఇప్పటికైనా ఎమ్మెల్యేలు తమను పట్టించుకున్నారని ద్వితీయశ్రేణి నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలో ఇద్దరి సస్పెన్షన్

గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని శర్మనగర్‌లో గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఆ రోజు విధుల్లో ఉన్న పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌తో పాటు వసతి గృహ ఉపసంక్షేమాధికారి ఉమాదేవిని విధుల్లో నుంచి తొలగిస్తూ, మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే పాఠశాలలో అధ్యాపకురాలిగా కొనసాగుతున్న సుజాతను తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

మంటల్లో చిక్కుకుని యువకుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని యువకుడు నమిలికొండ నూతన్ వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని బుధవారం రాత్రి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్ తన తల్లి రాజవ్వ, సోదరుడు నరేశ్‌లతో కలిసి రామన్నపేటలో ఉంటున్నాడు. తల్లి రాజవ్వ బంధువుల ఇంటికి వెళ్లగా సోదరుడు నరేశ్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న నూతన్ కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో మూర్ఛ వచ్చి పొయ్యిపై పడడంతో మంటల్లో చిక్కుకున్నాడు. కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన నూతన్ కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి



కార్తీక్(ఫైల్)

మల్లాపూర్, జనవరి, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్(14) అనే బాలుడు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేదునూరి రాజం ఆరేళ్ల క్రితం చిత్తూర్ ప్రాంతం నుంచి కార్తీక్‌ను దత్తతకు తెచ్చుకున్నాడు. బుధవారం సాయంత్రం కార్తీక్ బయటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వ్యవసాయ పరిసరాల్లో వెతుకుతుండగా గ్రామ శివారులోని బావి ఒడ్డుకు కార్తీక్ చెప్పులు, బట్టలు కనిపించాయి. దీంతో బావిలో వెతకగా కార్తీక్ మృతదేహం లభించింది. కార్తీక్ చేపలు పట్టేందుకు బావి వద్దకు వెళ్లి ఈతరాక మునిగి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లికి వెళ్లేరహదారి పనుల కోసం పాండవుల గుట్ట నుంచి మట్టి తరలిస్తుండగా గురువారం టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 597సర్వే నంబరులోని పాండవులగుట్ట కబ్జా అవుతోందని, అంతేకాకుండా మట్టిని తరలించుకుపోతుంటే కొందరు భూమిని కబ్జా చేసి అక్రమంగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందన్నారు. ఎస్సై వెంకటేష్ టిప్పర్లు అడ్డుకున్న గ్రామస్థుల వద్దకు వచ్చి ప్రభుత్వ అభివృద్ధి పనులకు మట్టి తీసుకెళ్తున్నారని టిప్పర్లు అడ్డుకునే అధికారం లేదని, సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులకు తెలియజేశారు. అధికారులు, పట్టించుకోవడం లేదని అందుకే అడ్డుకున్నామని గ్రామస్థులు తెలిపారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన పెద్దపల్లి ఎంపీ

- పారిశుధ్య లోపంపై ఆగ్రహం
- విద్యార్థులతో కలిసి భోజనం



వాష్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

గోదావరిఖని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గురువారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లోని జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వాష్‌రూమ్‌లు, భోజనశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సొంత పిల్లల్లా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని ఎంపీ తెలిపారు.

ఆరేళ్లుగా.. అసంపూర్తిగా..



మానకొండూర్‌లో లో లెవల్ బ్రిడ్జిపై పూర్తి కాని తారు రోడ్డు నిర్మాణ పనులు

- మానకొండూర్-జమ్మికుంట రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- పూర్తి కాని లో లెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అన్నారంలో పూర్తికాని తారురోడ్డు



అన్నారంలో నిలిపివేసిన మురికి కాలువల నిర్మాణం



అన్నారం లో లెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

మానకొండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్-జమ్మికుంట డబుల్ రోడ్డు పనులు ప్రారంభమై ఆరేళ్లు గడిచాయి. ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం రూ. 70 కోట్ల నిధులను మంజూరు చేసింది. మానకొండూర్ గ్రామ పంచాయతీ నుంచి మార్కెట్, మసీద్ మీదుగా తూర్పు దర్వాజ బస్టాండ్ నుంచి జమ్మికుంట వరకు ఓ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాడు. మానకొండూర్, రాఘవాపూర్, అన్నారం, లలితాపూర్, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, పచ్చునూర్ వరకు సబ్ కాంట్రాక్టర్ పనులను చేపట్టాడు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు మరో సబ్ కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అప్పటి హుజురాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహించిన వీణవంక మండలంలోని మామిడాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

అరకొర పనులతో అవస్థలు

మానకొండూర్ మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు ఆయా గ్రామాల ప్రజల ఆందోళనలతో అరకొర పనులు చేయడానికి సుమారు ఆరేళ్లు పట్టింది. అన్నారం నుంచి మానకొండూర్ వరకు తారు రోడ్డు లేక ఆరేళ్లు దుమ్ము, ధూళి మధ్య ప్రయాణికులు అనేక ఇబ్బందులతో ప్రయాణం కొనసాగించారు. మానకొండూర్, అన్నారం గ్రామాలలో రోడ్డు వెడెల్పులో జాప్యం అయింది. ఈ రెండు గ్రామాలతో పాటు రాఘవాపూర్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేయడమే కాకుండా అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను అడ్డుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో మురికి నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు

లలితాపూర్, అన్నారం, మానకొండూర్ గ్రామాలలోని లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాటు ఇరువైపుల వంద మీటర్ల వరకు తారు రోడ్డు వేయలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇసుక లారీలు వెళ్లే సమయంలో దుమ్ము లేచి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఏడేళ్లుగా వర్షాకాలంలో కురిసే వర్షాలతో ఎగువ నుంచి వచ్చే వరదలో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రహించడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. అన్నారంలో నెల రోజుల క్రితం లో లెవల్ బ్రిడ్జికి ఇరువైపులా పైపులు వేసి మధ్యలో వదిలిపెట్టారు. మానకొండూర్‌లో పూర్తి స్థాయిలో పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టి తారు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అన్నారంలో అసంపూర్తిగా లో లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

కంకర తేలి.. ప్రమాదకరంగా..

వీణవంక (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల కేంద్రం నుంచి కరీంనగర్ రహదారి పనుల ఆరేళ్లుగా కొనసాగుతున్నాయి. కల్వర్టులు మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో వర్షాకాలం వరద పెరగడంతో తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కోర్కల్, శ్రీరాముల పేట గ్రామల మధ్య రోడ్డుపై కంకర తేలింది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన ప్రజలు కోరుతున్నారు.



వీణవంకలో కంకరతేలిన రోడ్డు

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్



యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నూతనంగా తీసుకువస్తున్న మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శాతవాహన యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ వీసీల నియామకాల్లో ఇండస్ట్రియల్ సెక్టార్ వాళ్లను తీసుకురావడాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. విద్యా వ్యవస్థను ప్రైవేటీకరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యా వ్యతిరేక విధానాలను ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. యూజీసీ నూతన మార్గదర్శకాలను వెనక్కి తీసుకోకపోతే పార్లమెంట్ భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల రాజ్‌కుమార్, దాడి మహేష్, గణేష్, ఉదయ్, భాను, మల్లేష్, దీక్షిత్ పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వీర్నపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలకేంద్రంలో ఓ కారు గురువారం ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మద్యం తాగి వాహనాన్ని అతివేగంతో నడపడంతో వాహనం అదుపు తప్పినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

● డిసాలినేషన్‌పై మేడారం విద్యార్థి ఉత్తమ ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి అభిలాష్, గైడ్ టీచర్

ధర్మారం/పెద్దపల్లి కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) ఉప్పు నీటిని మంచి నీటిగా మార్చే (డిసాలినేషన్) ప్రక్రియలో ధర్మారం మండలం మేడారం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పి. అభిలాష్ జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు జడ్చర్లలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్ 2023-2024లో ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి పుదుచ్చేరిలో జరిగే ప్రదర్శనలో అభిలాష్ పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్ఎం వసంత తెలిపారు. సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చే డిసాలినేషన్ సోలార్ పరికరాన్ని అభిలాష్ రూపొం దించాడు. పాఠశాల ఫిజిక్స్ గైడ్ టీచర్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ రూపొందించినట్లు అభిలాష్ తెలిపాడు. ఈ సందర్భంగా విద్యార్థిని డీఈవో మాధవి ఒక ప్రకటనలో అభినందించారు.

గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థి



ప్రశంసాపత్రం అందుకుంటున్న విశాల్

సిరిసిల్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన చిప్పల విశాల్ ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎస్వీకేఎం పాఠశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చిప్పల విశాల్, గైడ్ టీచర్ తాడూరి సంపత్‌కుమార్ మార్గదర్శనంలో తయారు చేసిన జంతు మృత దేహాలను తొలగించే ట్రాలీ ఆవిష్కరణను ప్రదర్శించాడు. జాతీయస్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థితో పాటు గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌కు ప్రశం సాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థి విశాల్‌తో పాటు గైడ్ టీచర్‌ను జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, సైన్స్ అధికారి పాముల దేవ య్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



అక్షయ

గంభీరావుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అక్షయ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో జనవరి 10 నుంచి 14 వరకు జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అక్షయ పాల్గొంటారు. అక్షయ తెలంగాణ టీం హ్యాండ్ బాల్ జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. పాఠశాల హెచ్ఎం వెంకటరామారావు, ఉపాధ్యాయ బృందం అక్షయను అభినందించారు.


జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2 ఉద్యోగి



నవీన్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆర్జీ-2కు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు అనుమాండ్ల నవీన్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ నెల 10,11 తేదీల్లో జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ అండ్ ఇండియా ఎక్స్‌పర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ జరగనున్నది. 'ఇంప్రూవింగ్ హెల్త్ అండ్ సేఫ్టీ ఎట్ వర్క్‌ప్లేస్ అండ్ ఇంప్రూవ్ నెగోషియేషన్ స్కిల్స్ ఫర్ కాన్‌ఫ్లిక్ట్ రెసల్యూషన్' అనే అంశంపై వర్క్‌షాప్ జరగనున్నది. ఐఎన్‌టీయూసీ ప్రతినిధిగా ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు.

రామగుండంలో బొగ్గు దందా..



వ్యాగన్ నుంచి బొగ్గును చోరీ చేస్తున్న వ్యక్తులు (ఫైల్)

- మళ్లీ రంగంలోకి పాత స్మగ్లర్లు
- ఎన్‌టీపీసీకి రవాణా అయ్యే వ్యాగన్ల నుంచి చోరీ
- లక్ష్మీపురం, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్‌ల్లో ముఠాలు
- హైదరాబాద్‌కు, ఇటుక బట్టీలకు టన్నుల కొద్దీ బొగ్గు తరలింపు

కోల్‌సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో మళ్లీ కోల్ మాఫియా కార్యకలాపాలు మొదలు పెట్టింది. గతంలో పీడీ యాక్టులు, కేసులతో కొంత వెనక్కి తగ్గిన స్మగ్లర్లు మళ్లీ తమ బొగ్గు దందా మొదలుపెట్టారు. సింగరేణి నుంచి ఎన్‌టీపీసీకి రావాణా అయ్యే బొగ్గును రైల్వే వ్యాగన్ల నుంచి చోరీ చేసి ఇటుక బట్టీలు, హైదరాబాద్‌లోని పరిశ్రమలకు తరలిస్తున్నారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్, మారేడుపాక గ్రామాల్లో ముఠాలను ఏర్పాటు చేసుకున్న స్మగ్లర్లు ప్రతి రోజు తెల్లవారు జామున 2గంటల నుంచి 5 గంటలలోపు బొగ్గును రవాణా చేస్తున్నట్టు సమాచారం.

గోదావరిఖని వన్ సీఎస్‌పీ, ఓసీపీ-3 సీహెచ్‌పీ, ఓసీపీ-1 సైలోల నుంచి ఎన్‌టీపీసీకి బొగ్గు రవాణా జరుగుతుంది. రేకులు కూడా టైమ్ టేబుల్ ప్రకారం వెళతాయి. రైలు మార్గం ఉన్న మారేడుపాక, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ మధ్య వ్యాగన్ల నుంచి బొగ్గు తీస్తున్నారు. చీకటి పడిందంటే మారేడుపాక రైలు గేటు సమీపంలోనే పదుల సంఖ్యలో వ్యక్తులు బొగ్గు దొంగతనాలు చేసేందుకు వ్యాగన్లకు ఎక్కి నిర్దేశిత ప్రాంతంలో బొగ్గును కింద పడేస్తున్నారు. అనంతరం డంపు చేసి బొగ్గు స్మగ్లర్లకు బస్తాకు రూ.30 నుంచి రూ.50 చొప్పున అప్పగి స్తున్నట్టు తెలుస్తోంది. స్మగ్లర్లు మార్కెట్‌లో సింగరేణి బొగ్గును టన్నుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఇటుక బట్టీలతో పాటు హైదరాబాద్ పరిశ్రమలకు కూడా ఈ బొగ్గును దొడ్డి దారిన తరలిస్తున్నట్టు తెలుస్తోంది.



ఇటీవల సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న బొగ్గు (ఫైల్)

రక్షణ విభాగాల పరోక్ష సహకారం..

బొగ్గు చోరీలకు సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు కూడా పరోక్షంగా సహకరిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

గతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ రక్షణ విభాగాలు, పోలీస్ శాఖ కలిసి జాయిం ట్ ఆపరేషన్లు చేసేవి. దాంతో పకడ్బందీగా చోరీలను అరికట్టారు. ఈసారి ఆయా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. తమ గనుల పరిధి దాటితే తమకు సంబంధం లేదని సింగరేణి, సింగరేణిదే బాధ్యత అంటూ ఎన్‌టీపీసీ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎందరో క్షతగాత్రులు...

బొగ్గు చోరీ ఇది సామాజిక సమస్యగా మారింది. గతంలో ఎఫ్‌సీఐ మూత పడడంతో పరిసర ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి లేక బొగ్గు చోరీలకు పాల్పడేవారు.. స్మగ్లర్లు పిల్లలను కూడా ఈ దందాలోకి దించేవారు. లక్ష్మీపురం, ఎల్కలపల్లి, మారేడుపాక, గోదావరిఖని రాంనగర్‌కు చెందిన పలువురు బొగ్గు తీసే క్రమంలో ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు. కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. పోలీసులు ఈ దందాపై ఉక్కుపాదం మోపి పలువురిని బైండోవర్ చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. దీంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. ఇప్పుడు మళ్లీ స్మగ్లర్లు ఈ దందాను మొదలు పెట్టడంతో ఆర్ఎఫ్‌సీఎల్ పరిసర ప్రాంతాలపై దీని ప్రభావం పడుసున్నది.

మూడు ఠాణాల పరిధిలో దందా...

స్మగ్లర్లు ఎంపిక చేసుకున్న ప్రాంతాలు మూడు ఠాణాల పరిధిలోకి వస్తాయి. ఎన్‌టీపీసీ, గోదావరిఖని టూటౌన్, బసంత్‌నగర్ ప్రాంతాల్లో బొగ్గు చోరీలు, రవాణాకు కేంద్రాలుగా మారాయి. ఈ దందా నిరాటంకంగా సాగేందుకు స్మగ్లర్లు తమ పాత పరిచయాలు ఉపయోగించుకుంటున్నట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా దందా నిరాటంకంగా సాగుతున్నా ఎక్కడా కూడా పోలీస్ కేసులు నమోదు కాలేదు.



అడపాదడపా దాడులు చేసి నిల్వ ఉంచిన బొగ్గును మాత్రం సింగరేణి సెక్యూరిటీ విభాగం స్వాధీనం చేసు కుంటోంది. ఎన్‌టీపీసీ వద్ద సీఐఎస్ఎఫ్ యూనిట్లు ఉన్నా కనీస గస్తీ పెట్టిన పరిస్థితి లేదనే ఆరోపణలున్నాయి. బొగ్గు రవాణా అయ్యే గూడ్స్ సిబ్బందే సహకారం అందిస్తున్నట్టు కూడా ఆరోపణలున్నాయి.



రైల్వే ట్రాక్ వెంట బొగ్గు బస్తాలు (ఫైల్)

పండుగకు ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త



కరీంనగర్ క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని ఊరెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. బంగారం, నగదు, ఇతర విలువైన సొత్తును ఇళ్లలో పెట్టుకోకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచు కోవాలని లేదా వెంట తీసుకుపోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వెల్లడించారు.

- తాళంవేసిన ఇళ్లల్లో లైట్లను వేసి ఉంచాలి.
- ఇళ్లల్లోని సీసీ కెమెరాలను తరచుగా పరిశీలించి, అనుమానం ఉంటే స్థానికంగా ఉండే బంధువులు, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలి.
- తాళం వేసిన సంగతి తెలియకుండా తలుపునకు కర్టెన్ వేయాలి.
- బంగారం, వెండి నగలు, ఇతర విలువైన వస్తువులు, సొత్తు ఇంట్లో పెట్టకూడదు.
- బీరువా తాళాలు ఇంట్లో పెట్టకూడదు.
- ఇళ్ల ప్రధాన ద్వారం వద్ద చెప్పులు ఉండేలా చూడాలి.

ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు



వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లు



ధర్మపురి ఆలయంలో పూలతో అలంకరించిన ఉత్తర ద్వారం

వేములవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామునే ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో ఆలయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5.10 గంటల స్వామివారి పల్లకి సేవ ప్రవేశం అనంతరం పెద్ద సేవ పైన ఆలయం చుట్టు ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వార దర్శనం కల్పించనన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా ధర్మపురి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్తరద్వారాన్ని పూలతో అందంగా పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి పట్టణ, పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఆలయ అధికారులు, సిబ్బందికి కలిసి ఆయన పలు సూచనలు చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కిరణ్, రవికిరణ్, ఆర్ఐ కిరణ్ ఉన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఉత్తర ద్వారాన్ని ప్రత్యేకించి అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. ఆలయంలో కోయిల్ తిరుమంజనమ్ సేవ నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వస్త్ర చిత్ర కళా ఉద్యమి (ఎంబ్రాయిడరీ వర్క్స్)లో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించి 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7981151653, 9849 411002 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యా సమాచారం

16 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు



గణేశ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

● **21 నుంచి పీజీ, ఎంబీఏ పరీక్షలు**

ఎస్‌యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల పూర్తి సమాచారం www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు 21నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

సమీకృత మార్కెట్ పూర్తయ్యేది ఎప్పుడో..?



అసంపూర్తిగా ఉన్న వెజ్ మార్కెట్ భవన నిర్మాణం

● ఇబ్బందులు పడుతున్న విక్రయదారులు ● ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ప్రజలు

మెట్‌పల్లిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వార సంత కారణంగా పాత బస్టాండ్‌లోని వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ సంతకు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, ఆర్మూర్ మండలాలతో పాటు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం నిజామాబాద్, జగిత్యాల జిల్లా కేంద్రాలకు చెందిన వ్యాపారులు క్రయ విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు డివిజన్ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వెల్లుల రోడ్డులో సమీకృత మార్కెట్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి 10.50 కోట్ల నిధులను కేటాయించింది.

అప్పటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు దీంతో పట్టణ ప్రజలకు ఇటు ట్రాఫిక్ సమస్య తీరుతుందని, మార్కెట్ల నిర్మాణంతో వివిధ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అవి ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు.

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పను లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మొదట్లో వేగంగా చేసాడు. కానీ బిల్లులు రాకపోవడంతో మార్కెట్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా తయారయ్యాయి. పనులు ప్రారంభి ఏళ్లు పూర్తి కావస్తున్నా నేటికి పూర్తి కాకపోవడంతో చిరు వ్యాపారులు, మాంసం దుకాణదారులు, పల్లెల నుంచి వచ్చి కూరగాయలు అమ్మే రైతులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో పాటు, ఆహారపదార్థాలు, మాంసం విక్రయాలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులు, అధికార పార్టీ నాయకులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తీరనున్న ట్రాఫిక్ సమస్య

ప్రతీ మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్, వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో వార సంత ఉంటుంది. అదే విధంగా మంగళవారం వార సంత నిర్వహిస్తుండటంతో వెల్లుల ఎల్లమ్మకు వారు కూడా అదే రోడ్డు వెంబడి వెళ్తుంటారు. దీంతో ఆ ప్రాంతం అంతా ప్రజలతో కిక్కిరిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అంతే కాకుండా వాహనాలు సైతం ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిలిపి క్రయవిక్రయాలు చేస్తుండంతో నిలబడేందుకు కూడా స్థతం ఉండడం లేదు. సాయంత్రం సమయంలో ఆటోలు, పాఠశాలల బస్సులు రోడ్డుపైకి రావడంతో ప్రజలు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమీకృత మార్కెట్ భవనం పూర్తియైతే ఈ సమస్య ఉండదు.



అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ భవనం

సమీకృత మార్కెట్‌లోనే అన్ని సౌకర్యాలు

సమీకృత మార్కెట్‌లో మాంసం, కూరగాయలు, పూలు,పండ్లు, ఇతర రకాల వస్తువులు అన్ని ఒకే చోట విక్రయించేలా మార్కెట్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం అవసరం మేరకు షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. వీధి దీపాలు, సీసీ రోడ్లు, మంచి నీరు, టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయలను కల్పిస్తున్నారు. ఎండ, వానా కాలాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బంది లేకుంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. విద్యుత్ వెలుగులతో రాత్రి పూట కూడా మార్కెట్ సదుపాయం ఉంటుంది.

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి



దొనికెల నవీన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మెట్‌పల్లి

ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి మంగళవారం అక్కడకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ భవనం పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

● సీఎంకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ లేఖ

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బహిరంగ లేఖ రాశారు. విద్య, వైద్యం విషయంలో కాంగ్రెస్ తీరు కోట్లాది మంది ప్రజలను తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు బాగా లేదన్నారు. ఒక వైపు ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కానీ అసలు ఆరోగ్యశ్రీ బిల్లులే చెల్లించకుండా వైద్య సేవలు ప్రజలకు అందకుండా చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఏడాది పాలనలో ఆరోగ్య శ్రీ బకాయిలు వేయి కోట్లకు పైగా పేరుకు పోయాయని బండి సంజయ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల 7 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అందక కళాశాలల యాజమాన్యాలు మూతపడే పరిస్థితి ఉందన్నారు. యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 వేల కోట్లు చెల్లించి లక్షలాది మంది రోగులు, విద్యార్థులను ఆదుకోలేరా అని బండి సంజయ్ ప్రశ్నించారు. విదేశీ పర్యటనలు, ఢిల్లీ పర్యటనలు, మూసీ పునరుజ్జీవం, ఫోర్త్ సిటీ పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యం, విద్యపై ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, లేకుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి నాయకత్వంలో విద్యార్థులు, పేదలతో కలిసి ఉద్యమిస్తామని లేఖలో హెచ్చరించారు.

ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్



జిట్టవేణి శ్రీను



జెట్టిపల్లి అశోక్



కలిగేటి శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లాకు చెందిన జిట్టవేని శ్రీను, జెట్టిపల్లి అశోక్, కలిగేటి శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి 14 వరకు జరగనున్న పోటీలకు వీరిని టెన్నికల్ అఫీషియల్స్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన వారిని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

మండలంలో 636 మహిళా స్వశక్తి సంఘాలు..

- పోగుల సుధాకర్, ఏపీఎం



ప్రశ్న : మండలంలో ఎన్ని స్వశక్తి సంఘాలు ఉన్నాయి. వాటిలో ఎంతమంది సభ్యులు?

జవాబు : సంఘాలు 636ఉన్నాయి. సభ్యులు 5,045మంది ఉన్నారు.

ప్రశ్న : ఎంతమంది మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించారు? ఎంత మొత్తం ఇచ్చారు. ?

జవాబు : 188మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.15కోట్ల7లక్షల16వేలు అందించాం.

ప్రశ్న :ఎన్ని యూనిట్లు ప్రారంభించారు?

జవాబు : మండలంలోని 55మందికి పిండిగిర్నీ, కిరాణం, బ్యాంగిల్‌స్టోర్‌లాంటివి ప్రారంభించారు.

- ఎలిగేడు (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

12న ముగ్గుల పోటీలు

సుల్తానాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీరాంనగర్ లో ఈనెల 12న ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మెంగని రాధ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని మొదటి మూడు బహుమతులకు కలిపి మూడు వేల రూపాయలు నగదు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పోటీలలో పాల్గొనాలని కోరారు.

ఆదర్శ విద్యార్థులకు షూస్ అందజేత

జూలపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సరఫరా చేసిన సాక్స్‌లు,షూలను గురువారం పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ స్వరూప సభ్యులతో కలిసి ప్రిన్స్‌పాల్ ఎండీ షాదుల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గంజాయి సేవించడంవల్ల దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో జీడీ కనకయ్య, డ్రగ్స్ కమిటీ మెంబర్ రేణికుంట్ల శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జూలపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై పీటీం సభ్యురాలు స్నేహలత అవగాహన కల్పించారు. ఎవరైనా విద్యార్థినులు, మహిళలను వెంటపడి వేధిస్తే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ ఎండి షాదుల్, షీటీం సభ్యుడు సురేష్, పలువురు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

మంథని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంసీ ఎదుట సర్వేనంబరు 1013లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు మేడగోని శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని మున్సిపల్ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

సొంత భవనాలకు మోక్షమెప్పుడో?

- సమస్యల వలయంలో ప్రభుత్వ గ్రంథాలయాలు - ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు



ధర్మారంలోని గ్రంథాలయ భవన నిర్మాణ శిలాఫలకం



కాల్వశ్రీరాంపూర్‌లో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

ధర్మారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రంథాలయం గత 35 ఏళ్లుగా పక్కా భవనానికి నోచుకోవడం లేదు. 2023లో సొంత స్థలం కేటాయించబడి, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.25 లక్షలు మంజూరైనా, ప్రభుత్వం నుంచి బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మండలం కేంద్రంలో 1989లో గ్రంథాలయం ఏర్పాటుకాగా, అప్పటి మాజీ సర్పంచ్ పూస్కూరి దామోదర్‌రావు ఇంట్లో కొనసాగించారు. తర్వాత నుంచి ఇప్పటివరకు ఒకచోట నుంచి మరోచోటికి మారుతోంది. 2024 ఆగస్టులో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచన మేరకు ప్రస్తుతం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గ్రంథాలయం కొనసాగుతోంది. అప్పట్లో గ్రంథాలయం పంచాయతీ గెస్ట్‌హౌస్‌లో కొనసాగుతున్న సమయంలో 2023లో గ్రంథాలయం పేరు మీద స్థలాన్ని పూస్కూరి నర్సింగరావు విరాళంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అప్పటి గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో భవన నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ గ్రాంటు కింద రూ.25లక్షలు మంజూరయ్యారు. అదే ఏడాది మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిల్లులు రావంటూ గ్రంథాలయ భవన నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం సమాచారం. దీంతో మంజూరైన పనులు రద్దుకాగా, బిల్డింగ్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం అయ్యింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయ సొంత భవన నిర్మాణానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

● సొంత భవనం లేక ఇబ్బందులు

- పాత నాగభూషణం, లైబ్రేరియన్



ధర్మారం లైబ్రేరియన్‌గా నేను 2003 సెప్టెంబర్ నుంచి పని చేస్తున్నాను. ప్రతి రోజు 35 నుంచి 50 మంది యువతీ యువకులు లైబ్రరీకి వస్తుంటారు. లైబ్రరీలో దాదాపు 5వేల పుస్తకాలు ఉన్నాయి. గ్రంథాలయానికి సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. 2023లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ, ఇప్పటివరకు నిర్మాణం జరగలేదు. ఇప్పటికైనా భవన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.

శిథిలావస్థలో గ్రంథాలయం..

- పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన పైనం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. కొన్నేళ్లుగా స్లాబ్ పైభాగం పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. దాదాపు 30 ఏళ్లుగా కొనసాగుతున్న గ్రంథాలయ పక్కా భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో 25లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రంథాలయ భవన నిర్మాణానికి గతంలోనే నాలుగు గుంటల భూమిని కేటాయించారు. అయినా ఇంతవరకు గ్రంథాలయ భవనం నిర్మాణానికి మోక్షం కలగలేదు. నలభై సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్మించిన పాతభవనంలోనే ఇప్పటికీ గ్రంథాలయం నడుస్తోంది. ప్రతిరోజు 30నుంచి 40మంది పాఠకులు గ్రంథాలయానికి వస్తుంటారు. గ్రంథాలయంకు వచ్చే పాఠకులు భయంభయంగా పత్రికలు, పుస్తకాలు చదవాల్సి వస్తోంది. వర్షాకాలంలో గ్రంథాలయంలోని ఉరుస్తుండడంతో పాటు, పైపెచ్చులూడి కిందపడుతున్నాయని పాఠకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు.

సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరుపై త్రీడీ ఆర్ట్

మంథని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎక్కువగా మోసపోతున్న సైబర్‌క్రైం నేరాల నియంత్రణ కోసం ప్రజలకు అవగాహన కల్పించడానికి మంథనికి చెందిన త్రీడీ ఆర్టిస్టు ఎస్‌ఎస్‌ఆర్‌కే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930పై త్రీడీ ఆర్ట్ వేసి గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఎదుట గురువారం ప్రదర్శించారు. దీనిపై ఏసీపీ రమేష్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక బాధ్యతగా మంచి కార్యక్రమానికి శ్రీకారంచుట్టిన ఎస్‌ఎస్‌ఆర్‌కేను అభినందించారు. ఈకార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహిత ఖాజామొయినుద్దీన్ ఉన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

ఓదెల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంసానిపల్లి, లంబాడతండాల్లో గురువారం టీబీ కేంద్రం సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాలను నిర్వహించారు. రెండు గ్రామాల్లో టీబీ రోగులను గుర్తించిన మేరకు వైద్యం కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపించారు. హెచ్‌వీ బేబిరాణి, హెచ్‌ఏ విద్యాసాగర్,ఏఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుల నియామకం



కూకట్ల నాగరాజు, కందుల శ్రీనివాస్, చిలువేరు సంపత్‌కుమార్, కొయ్యడ సతీష్‌యాదవ్, కొప్పుల మహేష్

సుల్తానాబాద్, జనవరి9: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ, మండల శాఖలకు నూతనంగా అధ్యక్షులను నియమించారు. సుల్తానాబాద్ రూరల్ శాఖ అధ్యక్షులుగా మండలంలోని మియాపూర్‌కు చెందిన కందుల శ్రీనివాస్‌ను నియమించారు. సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షులుగా మరోసారి కూకట్ల నాగరాజును కొనసాగించారు.

● కాల్వశ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చిలువేరు సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు.

● కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ సతీష్‌యాదవ్ బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కొప్పుల మహేష్‌ను బీజేపీ మండల అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. రెండవ సారి అవకాశం కల్పించిన అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి : చైర్మన్ తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ సహకారంతో మార్కెట్‌ను రాష్ట్రంలో ఉత్తమ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యాలయం బిల్డింగ్‌తో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, మార్కెట్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువలో ‘సహకారం’

(3వ పేజీ తరువాయి)

ఒక సహకార సంఘం మాత్రమే ఉండగా, జిల్లాల పునర్విభజన సందర్భంగా కొత్తగా ఏర్పడ్డ అంతర్గాం, రామగిరి మండలాల్లో సహకార సంఘాలు లేకపోగా, జిల్లాలో గుంజపడుగు, గర్రెపల్లి, రాఘవాపూర్, జనగామ, కొలనూర్ మండలాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. వీటిలో గుంజపడుగు, గర్రెపల్లి మండలాల ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. కొత్తగా సహకార సంఘాలు మంథని మండలం గుంజపడుగు, వెంకటాపూర్, అంతర్గాం, రామగిరి, ఓదెల మండలంలో కొలనూర్, తదితర ప్రాంతాల్లో ఏర్పడే అవకాశాలున్నాయి. ఎక్కడైతే సంఘాన్ని ఏర్పాటు చేస్తారో అక్కడ ఉండే వనరులు, రైతుల సంఖ్య, గ్రామాల సంఖ్య, భవనం, గోదాముల నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ స్థలం ఎంత ఉంది, సంఘం ఏర్పాటు చేస్తే ఏటా వచ్చే ఆదాయం ఎంత, ఆ డబ్బులతో సిబ్బంది జీతభత్యాలు, సంఘం నిర్వహణ సాధ్యాసాధ్యాలపై పరిశీలన జరుపుతున్నారు. అనువుగా ఉండే ప్రాంతాల్లో జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సూచనల మేరకు సహకార సంఘాలను ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించే అవకాశమున్నది.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

కమాన్‌పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రస్తుతం ఉన్న ఏడు ఎంపీటీసీ స్థానాలకు తోడుగా అదనంగా మరో ఆరు ఎంపీటీసీ స్థానాలను పెంచాలని కోరుతూ బీఆర్‌ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో లలితకు నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖాధ్యక్షుడు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండలాధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు తోడేటి రాజీర్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్‌లు ఉన్నారు. అలాగే మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి వితరణగా ఇచ్చిన డెడ్‌బాడీ ఫ్రీజర్ దెబ్బతిందని, దానిని బాగు చేసి అందుబాటులో వచ్చేలా చూడాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీడీవో లలితకు వినతి పత్రం సమర్పించారు. పొన్నం ప్రవీణ్ స్మారకార్థం కుటుంబ సభ్యులు వితరణ ఇచ్చారని వినతిపత్రంలో తెలిపారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నకోటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. రాష్ట్ర పంచాయతీ ఉద్యోగులు సంఘాన్ని టీఎన్జీవోల సంఘంలో విలీనం చేశామని, ఇక తాము కూడా టీఎన్జీవోల సంఘంలో బాగమని తెలిపారు. ఈమేరకు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.టీఎన్జీవోల సంఘంకు అనబంధంగా ఉండే తమ రాష్ట్ర కమిటీకి నూతన అధ్యక్షుడిగా మామిడాల నర్సింహులు, ఉపాధ్యక్షులుగా బోల్ల శ్రీనివాస్, ర్యాగం లక్ష్మణ్, కోశాధికారిగా పిల్ల రవియాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జొన్నకోటి వెంకటేశ్ ఎన్నికయ్యారని వివరించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

జ్యోతినగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. గురువారం రాత్రి ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో అంతర్గాం, పాలకుర్తి మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలలో ఆయా ప్రభుత్వ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 26 నుంచి రైతు భరోసాతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో రెండు మండలాల ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జూలపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్‌కార్యకర్త కొంపల లచ్చయ్య ఇటీవల మృతిచెందాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునిల్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, దాడి సంతోష్, వేల్పుల రమేష్, సంపత్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, తిరుపతి, రాజు ఉన్నారు.

ఎన్టీపీసీ సీజీఎంతో ‘రెవా’ నేతల భేటీ



ఎన్టీపీసీ సీజీఎంను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జ్యోతినగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ కొత్త సీజీఎం (హెచ్‌వోపీ) చందన్ కుమార్ సామంతను గురువారం ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం(రెవా) నాయకులు కలిశారు. ఇటీవలే హెచ్‌వోపీగా బాధ్యతలు తీసుకున్న చందన్‌కుమార్‌ను ఈసందర్భంగా రెవా ప్రతినిధులు సత్కరించారు. ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్‌స్కీం అమలయ్యేలా సీజీఎం చొరవ చూపించాలని కోరారు. ఎంప్లాయీస్ పెన్షన్‌స్కీం 1995ను అనుసరించి నిజమైన వేతనాల వివరాలు, అదనపు సమాచారం ఈపీఎఫ్ అధికారులకు అందించాలని కోరారు. సీజీఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. సీజీఎం సానుకూలంగా స్పందించారు. అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాంకిషవన్, సట్టు ముత్యాలు, తిరుమల సునేందర్, దుర్గం నర్సయ్య, పోచయ్య, లాలయ్య, శ్రీపతిరావు, రాంనారాయణ, డెల్లి వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రినిటి ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా..

పెద్దపల్లి కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి త్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారి అటానమస్ హోదా లభించింది. గురువారం కళాశాలలో అందుకు సంబంధించిన లెటర్‌ను ఆవిష్కరించి విద్యార్థులతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రినిటీ ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అం దించాలని లక్ష్యంతో కళాశాల స్థాపించి, అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ అటానమస్‌గా గుర్తింపబడడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ మణి గణేష్, అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్ ఏవో సురేష్, చొప్పరీ వంశీ, రాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు ఆత్మీయ సన్మానం



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఓదెల, జనవరి 9: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైస్కూల్లో గురువారం ఎంఈవో ఆరెపల్లి రాజయ్యకు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ బృందాల ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మానాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎంఈవోగా విధులు నిర్వహించిన్నాళ్లు ఉపాధ్యాయులకు సేవలు, అలాగే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో కీలకంగా వ్యవహరించి, ఇటీవల సుల్తానాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు ఓదెల మండలంలో నియామకమైన ఎంఈవో రమేష్‌ను స్వాగతం పలుకుతూ, బదిలీ అయిన రాజయ్యకు వీడ్కోలు పలికారు. ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు ఉపాధ్యాయ సంఘాలతోపాటు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, ఎంఈవో రమేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సాంబయ్య, పద్మ, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు చిటికేసి సతీష్, డీటీఎఫ్, పీఆర్‌టీయూతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆర్జీ-2 ఏరియా సమస్యలపై డైరెక్టర్‌కు వినతి



డైరెక్టర్(పా)కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ బృందం గురువారం డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేసింది. గోదావరిఖని నుంచి సెంటినరీకాలనీ వరకు కోల్‌కారిడార్ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని, సెక్టార్-3 డిస్పెన్సరీలో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను మెరుగుపరచాలని కోరారు. కాలనీలోని కార్మిక కుటుంబాలకు సరిపడా గోదావరి నీటిని సరఫరా చేయాలని కోరారు. ఓసీపీ-3లో నూతన డోజర్లు, గ్రేడర్ల అవసరం ఉన్నదని, నూతన యంత్రాలను అంబుబాటులో తేవాలని కోరారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను వెంటను భర్తీ చేసేలా పరీక్షలు నిర్వహించి, దానిలో అంగవైకల్యం ఉన్నవారికి రిజర్వేషన్ కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, సహాయ కార్యదర్శి శ్యాంసన్, రవికుమార్, మహేందర్, రాజసాగర్, మహరాందర్, శ్రీనివాస్, ధనుంజయ, గట్టయ్య ఉన్నారు.

ఫారెస్ట్ భూములను పరిశీలించిన సీఎఫ్‌వో



మేడిపల్లి ఓసీపీలో పరిశీలన జరుపుతున్న సీఎఫ్ఓ ప్రభాకర్

గోదావరిఖని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీ ప్రభాకర్ గురువారం సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా అటవీ ప్రాంతంలో పర్యటించారు. జిల్లా ఫారెస్ట్ అధికారి సీహెచ్ శివయ్యతో కలిసి మేడిపల్లి ఓసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ ఇల్లందు క్లబ్‌లో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రభాకర్ సీఏ ల్యాండ్‌లో భాగంగా సుమారు 650 హెక్టార్ల విస్తీర్ణంలో గల మేడిపల్లి ఉపరితల గనికి సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. తదనంతరం మేడిపల్లి ఉపరితల గనిని సందర్శించి మేడిపల్లి వ్యూ పాయింట్ వద్ద నుండి క్వారీ ఓవర్ బర్డెన్ డంపులపైన పెంచిన అటవీ ఏరియాను పరిశీలించారు. కొత్తగూడెంలో వీకే ఓసీపీ ప్రాజెక్టు కోసం మేడిపల్లి ఓసీపీ వద్ద ప్రతిపాదించిన ఫారెస్ట్ ల్యాండ్‌లను పరిశిలించారు. మేడిపల్లి ఓసీపీ పరిసరాలలో ఆటవిని విస్తారంగా ఏవిధంగా అభివృద్ధి చేయాలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఎస్టేట్ డీజీఎం కుమార స్వామి, ఏరియా ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, ఫారెస్ట్ అధికారి కర్ణ, ఎస్టేట్ మేనేజర్ సాంబ శివరావు, మేనేజర్ మల్లిఖార్జున్ యాదవ్ పాల్గొన్నారు.

వాహనాల టెండర్లకు ఆహ్వానం

గోదావరిఖని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1లోని మైన్స్, డిపార్ట్‌మెంట్‌లలో 3, 4, 5సంవత్సరాలు కిరాయి పద్ధతిలో వాహనాలు నడుపుటకు డిసెంబర్ 23న టెండర్ నోటీసు జారీచేసినట్టు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్ నోటీసుకు సంబంధించి ఆసక్తిగల వెహికిల్‌ఓనర్లు, కాంట్రాక్టర్లు, ప్రాజెక్ట్ ప్రభావిత వ్యక్తులు, ప్రాజెక్ట్ వలన నిరాశ్రయులైన వారు, భూమిని కోల్పోయిన వారు, డిపెండెంట్ ఉద్యోగం పొందని మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మాజీ ఉద్యోగులు, ఇతరులు పాల్గొనవచ్చని తెలిపారు. తమ వాహనంతోపాటు డ్రైవర్‌ను కిరాయి పద్ధతిలో ఆర్‌జీ-1 ఏరియాలోని మైన్స్, డిపార్ట్‌మెంట్‌లలో ఉపయోగించడానికి ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించి రూ.590 ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో చెల్లించి దరఖాస్తుతోపాటు రశీదును డీఐ(ఎస్‌ఈ), పర్చేజ్ డిపార్‌మెంట్ ఆఫీస్‌లో సమర్పించి టెండర్ ఫామ్స్ పొందాలని సూచించారు. ఈ టెండర్ నోటీసును ఈనెల 13 సాయంత్రం 4గంటల వరకు పొందవచ్చని, 15న మధ్యాహ్నం 12లోపు టెండర్ దాఖలు చేయవచ్చ ని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3.30గంటల నుంచి టెండర్లు తెరుస్తారని పేర్కొన్నారు.

రేపు ఆర్జీ-2లో క్రీడల వార్షికోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్జీ-2 ఆధ్వర్యంలో ఈనెల 11న క్రీడల వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6గంటలకు స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జరగనున్న కార్యక్రమానికి క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. 2024-25 సంవత్సరానికి నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వానరానికి అంత్యక్రియలు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన వానరానికి కాలనీకి చెందిన పలువురు అంతయక్రియలు నిర్వహించారు. షిర్కేసాయిమారుతీనగర్ ఏరియాలో అనారోగ్యంతో వానరం మరణించగా, దానిని అబ్దుల్‌కలాం స్టేడియం సమీపంలో బీజేపీ నాయకులు, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఖననం చేశారు. అంత్యక్రియలు నిర్వహించిన వారిలో ఆకుల శశికుమార్, దాసరి శ్రీనివాస్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఫాతిమా షేక్ జయంతి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దేశంలో మొదటి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ జయంతిని ఈవీఎస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ గురువారం కాలనీలో నిర్వహించింది. స్పందన మోడల్ స్కూల్‌లో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ముస్లిం ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఇరికి మహేష్, పాఠశాల యాజమాన్యంతో పాటు అవినాష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

లఘుచిత్ర విజేతలకు సత్కారం

కోల్‌సిటీటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి లఘుచిత్ర పోటీల్లో బహుమతి అందుకున్న నగునూరి విజయ్‌కుమార్, అశోక్ వేములను నియర్ అండ్ డియర్ ఫ్రెండ్లీ ఆర్గనైజేషన్, రామగుండం యూట్యూబర్స్ అసోసియేషన్ గురువారం ఆత్మీయంగా సత్కరించింది. మార్కండేయకాలనీలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, దామెర శంకర్, మేజిక్ రాజా, దయానంద్‌గాంధీ, ఏలేశ్వరం వెంకటేష్, మల్లావఝుల విజయానంద్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.